క్లుప్తంగా

హిరోషిమా, నాగసాకి డే

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాల ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో హిరోషిమా, నాగసాకి డే సందర్భంగా బుధవారం అధ్యాపకులు, విద్యార్థులతో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. 1945లో జరిగిన భయానక అణుబాంబు దాడుల చరిత్రపై అవగాహన కల్పించి, శాంతి సందేశాన్ని విద్యార్థులకు వివరించే దిశగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సీతానగరం ప్రభుత్వ కళాశాల కామర్స్ అధ్యాపకుడు షేక్ మదీనా, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ బి.నాగేశ్వరరావు తెలిపారు. అణుశక్తి వెనుక ఉన్న శాస్త్రీయ సూత్రాలను వివరించారు. అణు శక్తి సద్వినియోగంతో లాభాలు ఎంతైనా ఉన్నా, దుర్వినియోగం తీవ్ర వినాశాన్ని తీసుకురావచ్చన్నారు. ఫ్రమ్ యాషెస్ టు అవేకనింగ్ అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ కోమలలక్ష్మి, భౌతిక శాస్త్ర విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

బీమా సంస్థల ప్రతినిధులతో సమావేశం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లా లోని వివిధ బీమా సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి బుధవారం సమావేశమయ్యారు. సెప్టెంబర్ 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక మొత్తంలో మోటారు వాహనాల ప్రమాదాల కేసులను పరిష్కరించేందుకు, బాధితులకు అందించాల్సిన పరిహారంపై తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పెండింగ్‌లో ఉన్న మోటారు వాహనాల ప్రమాద కేసులను గుర్తించి, జాబితాను డీఎల్ఎస్ఏకు అందజేయాలన్నారు. త్వరలో జరగనున్న ముందస్తు లోక్ అదాలత్ సమావేశాల్లో బీమా సంస్థల నిర్వాహకులు, ప్రమాదాల కేసుల్లో బాధితులు, ఇరు పక్షాల న్యాయవాదులు పాల్గొనాలన్నారు.

కదం తొక్కిన కామ్రేడ్లు

ప్రకాశం నగర్: సీపీఐ జిల్లా 26వ మహాసభలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపాక మధు ఆధ్వర్యంలో ప్రజా నాట్య మండలి కళాకారులు నృత్య ప్రదర్శనలు, గేయాలతో ఎర్ర జెండాలు చేత పట్టి భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక చర్చ్ గేటు నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ సుబ్రహ్మణ్య మైదానం వరకు సాగింది. అనంతరం జరిగిన బహిరంగ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ, మోదీ, చంద్రబాబు అసమర్థ పాలనను దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, జిల్లా సహాయ కార్యదర్శి రాంబాబు, రేఖా భాస్కరరావు పాల్గొన్నారు.

పుష్కరాలకు అభివృద్ధి ప్రణాళిక



మ్యాప్‌ను పరిశీలిస్తున్న జీఎం శ్రీవాస్తవ

రాజమహేంద్రవరం సిటీ: రానున్న గోదావరి పుష్కరాల నాటికి రాజమహేంద్రవరం, గోదావరి రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనులకు పక్కా ప్రణాళిక రూపొందించినట్టు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ వెల్లడించారు. బుధవారం ఆయా స్టేషన్లను విజయవాడ డీఆర్ఎం మోహిత్ సోనాకియా, ఇతర అధికారులతో కలసి సందర్శించారు. రైల్వే ట్రాక్‌ల నిర్వహణ, వంతెనలు, సిగ్నలింగ్ వ్యవస్థల భద్రతాంశాలను సమీక్షించారు. అనంతరం రైల్వేస్టేషన్ల అభివృద్ధి మ్యాప్‌లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, పనులను ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయని, వివిధ శాఖల సమన్వయంతో పకడ్బందీగా పనులు చేపడతామన్నారు. అలాగే కొవ్వూరు, నిడదవోలు స్టేషన్లను శ్రీవాస్తవ పరిశీలించారు. అభివృద్ధి పనులను పరిశీలించారు. కొవ్వూరు స్టేషన్‌లో పూర్వం ఉన్న 34 హాల్టులను పునరుద్ధరణ అంశం పరిశీలనలో ఉన్నట్టు తెలిపారు.

మయన్మార్ నుంచి సురక్షితంగా సొంతూరికి..

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): మయన్మార్ దేశంలో చిక్కుకున్న వ్యక్తి జిల్లా ఎస్పీ డి.నరసింహాకిశోర్ కృషితో సొంతూరు చేరాడు. ఆ వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయం బుధవారం వెల్లడించింది. పేరవరం మండలం కానూరుకు చెందిన బాసిన రాజేశ్వరి తన కుమారుడు శ్యాంకుమార్‌కు ఓ వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి మయన్మార్ తీసుకెళ్లి మోసం చేశాడు. తన బిడ్డ అక్కడ చిక్కుకున్నట్టు ఆమె ఎస్పీకి తెలిపింది. దీనిపై వెంటనే స్పందించి, నిడదవోలు సర్కిల్ పోలీసులకు చర్యలు చేపట్టాలని ఎస్పీ నిర్దేశించారు. నిడదవోలు పోలీసులు అతడిని సురక్షితంగా సొంత ఊరికి తీసుకొచ్చారు. తన కుమారుడిని క్షేమంగా అప్పగించడంతో తల్లీకొడుకులు ఎస్పీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

బుల్లెట్ చోరీ

రాజమహేంద్రవరం రూరల్: ఇంటి ముందు పార్కు చేసిన బుల్లెట్‌ను దొంగలు చోరీ చేశారని లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన యంగళ రవి బుధవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల 25న రాత్రి ఇంటి ముందు రవి తన బుల్లెట్‌ను పార్కింగ్ చేశారు. మరుసటి రోజు తెల్లవారుజామున బుల్లెట్ కనిపించలేదు. బొమ్మూరు హెచ్‌సీ రాజేంద్ర సింహాజీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘాటు నిర్లక్ష్యం

- గోదావరి స్నానఘట్టాల్లో అపరిశుభ్రత విలయతాండవం
- శ్రావణ మాసంలోనూ మారని అధికారుల తీరు
- కోటిలింగాల ఘాట్ వద్ద బురద నీరు
- ప్రవాహం ఉన్నచోట్లా కానరాని భద్రత



నాచు, బురదతో ప్రమాదభరితంగా ఉన్న కోటిలింగాల ఘాట్



దేవీచౌక్‌లోని బాలాత్రిపుర సుందరీదేవి

సీటీఆర్ఐ: శ్రావణ మాసమంటేనే ప్రత్యేకం. ముఖ్యంగా మహిళలు దీని కోసం ఏడాదంతా ఎదురుచూస్తారు. శ్రావణ మాసంలో వరలక్ష్మీ వ్రతం ఆచరించి, కుటుంబమంతా సుఖసంతోషాలతో ఉండాలని అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవార్లను కొలుస్తారు. శ్రావణ మంగళవారం మంగళగౌరీ వ్రతం ఆచరిస్తే, తమ మాంగల్యం పది కాలాల పాటు చల్లగా ఉంటుందనే నమ్మకం మహిళల్లో ఉంది. పవిత్రమైన ఈ మాసంలోనూ నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యం కారణంగా భక్తులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. గోదావరి నదీ వెంబడి ఉన్న స్నానఘట్టాల్లో అపరిశుభ్రత, భద్రతా లోపాలు భక్తులను అసహనానికి గురిచేస్తున్నాయి.

ఘాట్ల వద్ద అపరిశుభ్రత

శ్రావణ మాసంలో శుక్రవారం రోజు తెల్లవారుజామున భక్తులు నదీ స్నానాలు ఆచరిస్తారు. మహాలక్ష్మి అమ్మవారి దేవాలయాలకు వెళ్లి అమ్మవారిని కొలుస్తారు. ఇటువంటి తరుణంలో గోదావరి స్నానఘట్టాల వద్ద అపరిశుభ్రత తాండవిస్తోంది. ప్రసిద్ధ కోటిలింగాలఘాట్ వద్ద అపరిశుభ్రతతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యంత పొడవైన ఘాట్ ఇది. ఇక్కడ కోటిలింగేశ్వరుడు, అమ్మవార్ల ప్రాచీన దేవాలయం ఉండడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ఇక్కడ నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఇక్కడ ఘాట్ ఉపరితల ప్రదేశాన్నే శుభ్రం చేసి, స్నానాలు చేసే చోట మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు పడటంతో. నీరంతా బురదగా మారి స్నానాలు చేయడానికి వీల్లేకుండా ఉంటోంది. అంతేగాక అక్కడంతా నాచు పట్టి ఉంది. కనీసం నాచు కూడా తొలగించక పోవడంతో, నీటిలో దిగితే చర్మ వ్యాధులు రావడం ఖాయమని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కానరాని భద్రత

ఎగువ ప్రాంతాల్లో విస్తరంగా వర్షాలు కురవడంతో గోదావరికి భారీగా నీరు చేరుతోందది. కోటిలింగాలరేవు వద్ద స్నానాలు ఆచరించడానికి నీటిలోకి దిగితే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నప్పటికీ, ఇక్కడ హెచ్చరికల బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. కనీసం స్నానాలు ఆచరించే చోట తాడును కట్టినా, భక్తులకు కొంత భద్రత ఉంటుంది. ఆ మేరకూ అధికారులు కానీ, ప్రజా ప్రతినిధులు కానీ దృష్టి సారించిన దాఖలాలు లేవు. పుష్కరఘాట్ వద్ద సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉండడంతో, కేవలం ఆ ఒక్క ఘాట్‌ని మాత్రమే శుభ్రం చేసి. మిగిలిన వాటిని విస్మరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పుష్కరఘాట్ వద్ద కూడా కనీస హెచ్చరిక బోర్డు లేదు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నా, తాడు కూడా కట్టలేదు. మహిళలు అధికంగా పుష్కరఘాట్‌లో స్నానమాచరించే అవకాశం ఉన్నా, ఇక్కడ భద్రత చర్యలు చేపట్టకపోవడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఆలయాల ముస్తాబు

ఇలా ఉండగా రాజమహేంద్రవరంలోని దేవీచౌక్‌లో ఉన్న బాలా త్రిపుర సుందరీదేవి ఆలయం, వంకాయల వారి వీధిలోని వరలక్ష్మీ దేవాలయం, అష్టలక్ష్మీ దేవాలయాలను ముస్తాబు చేశారు.



పుష్కరఘాట్ వద్ద ఉధృతంగా నదీ ప్రవాహం.. భక్తుల భద్రతకు కానరాని తాడు

భద్రత ఏర్పాట్లు చేయాలి

శ్రావణ శుక్రవారం అధిక సంఖ్యలో మహిళలు స్నానం ఆచరించడానికి ఘాట్ల వద్దకు వస్తారు. పుష్కరఘాట్ వద్ద కనీస భద్రత చర్యలు లేవు. నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నా.. కనీసం లోపల వరకు రాకుండా తాడు కూడా కట్టలేదు. చిన్న పిల్లలు, మహిళలకు ఇది అపాయకరంగా ఉంది.

– ఎస్.భవాని, రాజమహేంద్రవరం

అపరిశుభ్రంగా కోటిలింగాలఘాట్

పుణక్షేత్రమైన కోటిలింగాల ఘాట్ వద్ద అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఇక్కడ స్నానం చేయాలంటే ఇబ్బందికరంగా ఉంది. నీటిలోకి దిగితే ఎక్కడ ప్రమాదం పొంచి ఉందో తెలియడం లేదు. స్నాన ఘాట్లను ప్రభుత్వం గాలికి వదిలేసింది. ఆదాయం వచ్చే ఘాట్లపైనే శ్రద్ధ పెడుతున్నారు.

– ఎం.శ్రీనివాసరావు, కోటిలింగాలపేట

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): వసతి గృహాల్లో సమస్యలను వెంటనే పరిష్కరించాలని, సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర హాస్టల్‌లో వార్డెన్‌తో పాటు ఇతర సిబ్బంది వెంటనే నియమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం డీఎస్‌డబ్ల్యూ, ఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, బాలుర వసతి గృహంలో 20 ఏళ్లుగా ఇన్‌చార్జి వార్డెన్‌తో నడిపిస్తూ దోపిడీ చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలు అధికమయ్యాయన్నారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచాలని, హాస్టల్‌లో లైబ్రరీ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి నెలా మెడికల్ చెకప్‌లు నిర్వహించాలన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి



విద్యార్థులకు ధ్రువపత్రాలను అందిస్తున్న ఆశాకిరణ్

కంబాలచెరువు: పాఠశాల స్థాయి నుండే విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో పాల్గొనాలని, తద్వారా పోటీతత్వం అలవడుతుందని నెహ్రూ నగర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి.ఆశాకిరణ్ అన్నారు. పాఠశాల విద్యార్థినులు ఇటీవల ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన టాలెంట్ హంట్ యూజింగ్ ఏఐ అంశంలో ప్రథమ, నాలుగు, ఐదు, ఆరు స్థానాల్లో నిలిచారని ఆమె బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆ విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె.జాన్సన్, వి.కిరణ్‌కుమార్, సీహెచ్ కన్నమనాయుడు, కె.రోజారమణి తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఎరువులతో ప్రదర్శన క్షేత్రాలు



సమావేశంలో మాట్లాడుతున్న మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో నానో యూరియా, నానో డీఏపీలను అధిక మొత్తంలో వాడించడానికి ప్రతి మండలంలో ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎస్ మాధవరావు తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఏడీఏలు, ఏఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నానో యూరియా 500 ఎంఎల్, నానో డీఏపీ 500 ఎంఎల్ ఎకరా వరి పంటకు సరిపోతుందన్నారు. నానో ఎరువుల వల్ల 20 శాతం రసాయన ఎరువులను తగ్గించడమే ముఖ్యోద్దేశమన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకంలో ఇప్పటికీ రైతుల ఖాతాల్లో సొమ్ము జమ కాకపోతే చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏడీఏలు శ్రీనివాసరెడ్డి, జయరామలక్ష్మి, డీవీ కృష్ణ, సీహెచ్ శ్రీనివాసరావు, ఏఓలు భీమరాజు, సూర్యరమేష్, ప్రశాంతి, శాంత ఆలివ్, దాక్షాయణి తదితరులు పాల్గొన్నారు.

పీజీ కోటా తగ్గింపుపై అభ్యంతరం



డాక్టర్ మౌనిక

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం 2025–26 విద్యా సంవత్సరం నుంచి పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న ఇన్ సర్వీస్ డాక్టర్లకు ఉన్న పీజీ (పోస్ట్ గ్రాడ్యుయేట్) కోటాను 20 శాతం నుంచి 15 శాతానికి తగ్గిస్తూ ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రైమరీ హెల్త్ సెంటర్ల డాక్టర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డా.మౌనిక ఓ ప్రకటనలో తెలిపారు. కేవలం జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పీడియాట్రిక్స్, గైనకాలజీ, అనస్థీషియా, ఎమర్జెన్సీ మెడిసిన్, రేడియాలజీ వంటి ఏడు క్లినికల్ శాఖలకే పరిమితం చేశారన్నారు. గతేడాది ప్రభుత్వ స్పష్టమైన హామీ మేరకు ఇన్ సర్వీస్ పీజీ కోటాపై ఏ నిర్ణయమైనా సంఘ ప్రతినిధులతో సంప్రదింపులు జరిపిన తర్వాత నిర్ణయం తీసుకుంటామన్నారు. అందుకనుగుణంగా ఈ ఏడాది జూలై 14న అసోసియేషన్ ప్రతినిధులు తమ వాదనలు ప్రభుత్వం ముందుంచినట్టు చెప్పారు. మరలా సంప్రదిస్తామని చెప్పి, సమాచారం ఇవ్వకుండా, మీడియా ద్వారా ఈ నిర్ణయం వెలుగులోకి రావడం ఇబ్బంది కలిగించిందన్నారు. దీనివల్ల గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులను తీవ్రంగా నిరుత్సాహపర్చేలా ఉందన్నారు. భవిష్యత్తులో గ్రామాల్లో పనిచేయడానికి ఆసక్తి చూపే వైద్యుల సంఖ్యను కూడా ప్రభావితం చేస్తుందన్నారు. పీజీ సీట్ల శాతం తగ్గించే నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని కోరారు.

జక్కంపూడి పోరాట పటిమ ఆదర్శప్రాయం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ
- కొత్తపల్లి బ్రదర్స్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు జయంతి సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, రౌతు సూర్యప్రకాశరావు, జక్కంపూడి గణేష్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, పెద్దిరెడ్డి అభినవ్ రెడ్డి

కడియం: మాజీ మంత్రి దివంగత జక్కంపూడి రామ్మోహన్‌రావు ప్రజల పక్షాన చూపిన పోరాట పటిమ, సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ కొనియాడారు. బుధవారం బుర్రిలంక గ్రామంలో పార్టీ నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షుడు కొత్తపల్లి శివాజీ, కొత్తపల్లి మూర్తి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, వైద్య శిబిరం, అన్నదాన కార్యక్రమాలను ఆయనతో పాటు, పార్టీ రాజమండ్రి పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కడియం ఎమ్మెల్యేగా జక్కంపూడి తెలుగు రాష్ట్రాల్లో విశేష గుర్తింపు పొందారన్నారు. ఆయన మంత్రిగా కడియం నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి పనులు భవిష్యత్తు తరాలకు శాశ్వతంగా నిలిచాయన్నారు. రక్తదాన శిబిరంలో సుమారు వంద మంది రక్తదానం చేశారని డాక్టర్ వైఎస్సార్, జక్కంపూడి రామ్మోహన్‌రావు బ్లడ్‌బ్యాంక్ నిర్వాహకురాలు జక్కంపూడి రాజేశ్వరి తెలిపారు. ఈ రక్తదాన శిబిరాన్ని రాజానగరం మాజీ ఎమ్మెల్యే, పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా సందర్శించారు. శిబిరాన్ని నిర్వహించిన కొత్తపల్లి శివాజీ, మూర్తి సోదరులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులు రెడ్డి, మండల అధ్యక్షులు యాదల సతీష్‌చంద్రస్టాలిన్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దొంతంశెట్టి వీరభద్రయ్య, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల చక్రవర్తి, తిరుమలశెట్టి శ్రీను, సాపిరెడ్డి సూరిబాబు, గాదా రామకృష్ణ, ఈలి సత్తిబాబు, తోకల శ్రీను, ఈలి గోపాలం, నాగిరెడ్డి రామకృష్ణ, రత్నం కృష్ణ, పంతాల రాము పాల్గొన్నారు.

జక్కంపూడి ఆశయ సాధనకు కృషి

కడియం: మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు ఆశయసాధనకు కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్రస్టాలిన్ అన్నారు. జేగురుపాడులో దివంగత జక్కంపూడి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుల సుధాకర్, మాజీ ఎంపీటీసీలు నాగిరెడ్డి వీరశివాజీ, పాలపర్తి ప్రకాష్‌కుమార్(పండు) తదితరులు పాల్గొన్నారు. కడియపులంక దోసాలమ్మ కాలనీ సెంటర్‌లో జక్కంపూడి జయంతి వేడుకలు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరిజాల బాబు, కడియం ఏఎంసీ మాజీ చైర్మన్ ఈలి గోపాలరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నిత్యం పేద ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూ జన యోధుడిగా ప్రజల హృదయాల్లో నిలిచిన రాజకీయ దురంధరుడు జక్కంపూడి రామ్మోహన్‌రావు అని ప్రముఖ నర్సరీ రైతు, అఖిల భారత నర్సరీ సంఘ మాజీ అధ్యక్షులు పల్ల సుబ్రహ్మణ్యం కొనియాడారు. జక్కంపూడి జయంతి వేడుకలను పల్ల వెంకన్న నర్సరీ రైతులు పల్ల సత్తిబాబు, సుబ్రహ్మణ్యం, గణపతి ఆధ్వర్యంలో కడియపులంక జాతీయ రహదారి వద్ద, దోసాలమ్మ కాలనీలోని జక్కంపూడి నిలువెత్తు విగ్రహాలకు ఘనంగా నివాళులర్పించారు. అలాగే కడియపు సావరం పుష్పలత పూలవర్తక సంఘ భవనంలో జక్కంపూడి రామ్మోహన్‌రావు అభిమానుల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జక్కంపూడి చిత్రపటానికి నివాళులర్పించారు. సంఘ భవన నిర్మాణంలో జక్కంపూడి చేసిన కృషిని పలువురు కొనియాడారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచులు సాపిరెడ్డి సూరిబాబు, వరగోగుల వెంకటేశ్వరరావు, సాపిరెడ్డి కామేష్, జ్యోతుల లక్ష్మీ సుధీర్, సాపిరెడ్డి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో జక్కంపూడికి జయంతి శుభాకాంక్షలు



అమెరికాలో జక్కంపూడి రామ్మోహనరావుకు అభిమానుల జయంతి శుభాకాంక్షలు

రాజమహేంద్రవరం సిటీ: అగ్రరాజ్యం అమెరికాలోని ప్రఖ్యాత నగరం న్యూయార్క్ టైమ్ స్క్వేర్‌లో కార్మిక నేత, మాజీ మంత్రి, దివంగత జక్కంపూడి రామ్మోహనరావు 72వ జయంతి సందర్భంగా అక్కడి స్క్రీన్‌పై అభిమానులు జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమాచారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో జక్కంపూడి అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి



జక్కంపూడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న గుత్తుల మురళీధర్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: జన హృదయ నేత, పోరాట యోధుడు, మాజీ మంత్రి దివంగత జక్కంపూడి రామ్మోహన్‌రావు ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నగర ఉపాధ్యక్షుడు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుత్తుల మురళీధర్ అన్నారు. జిమ్ కిరణ్ ఆధ్వర్యంలో 50వ డివిజన్ వాంబే గృహాల వద్ద జక్కంపూడి రామ్మోహన్‌రావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీధర్ కేక్ కట్ చేశారు. అంబేడ్కర్, పూలే విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం మురళీధర్ మాట్లాడుతూ జననేత జక్కంపూడి రామ్మోహన్‌రావు భౌతికంగా లేకపోయినా ఆయన చేసిన సేవలు, మంచి పనుల ద్వారా అభిమానుల గుండెలో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలిచేవారని, ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేశారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జన యోధుడు

ధవళేశ్వరం: జన యోధుడు జక్కంపూడి రామ్మోహనరావు ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని మాజీ డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు కొనియాడారు. బుధవారం ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో ఉన్న మాజీ మంత్రి దివంగత జక్కంపూడి రామ్మోహన్‌రావు విగ్రహం వద్ద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీర్రాజుతో పాటు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సాధనాల చంద్రశేఖర్(శివ), డాక్టర్ తోరాటి ప్రభాకరరావు, గరగ శ్రీనివాసరావు, గోలి దేవకుమార్, ముత్యాల పోసికుమార్, షట్టర్ బాషా, ఒంటెద్దు కృష్ణ, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, శ్రీరంగం బాలరాజు, దేవులపల్లి సరితారాణి, బర్రి కామేశ్వరరావు, ముద్దాల అను, పలుపులేటి దేవి, బొడ్డేటి శివాజీ, నంబూరి రవి, గూటం రాజు, మస్తాన్ బేగ్, దాసరి ధర్మ, పండెళ్ల భానుప్రసాద్, ముత్యాల జాన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ధవళేశ్వరం ఎర్రకొండపై జక్కంపూడి విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు జయంతి వేడుకలను నిర్వహించారు. నాయకులు బొడ్డేటి శివాజీ, షట్టర్ బాషా, గొన్నా సత్తిబాబు, నాయుడు, కృపావరం, బత్తి రాము పాల్గొన్నారు.

ఘనంగా జక్కంపూడి జయంతి వేడుకలు

రాజమహేంద్రవరం రూరల్: మాజీ మంత్రి దివంగత జక్కంపూడి రామ్మోహనరావు జయంతి వేడుకలు బుధవారం పిడింగొయ్యి వెంకటగిరిలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు బొప్పన సుబ్బారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జక్కంపూడి చిత్రపటానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సుందరపల్లి అనిల్, కుప్పాల రాంబాబు, కామిరెడ్డి పెద్దకాపు తదితరులు పాల్గొన్నారు. అలాగే శాటిలైట్‌సిటీలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో జక్కంపూడి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జక్కంపూడి చిత్రపటానికి పార్టీ నేతలు పూలమాలలు వేసి, కేక్ కట్ చేశారు. బొమ్మూరులో పార్టీ జిల్లా కార్యదర్శులు యెనుముల త్యాగరాజు, ముద్దాల తిరుపతిరావు జక్కంపూడి చిత్రపటానికి నివాళులర్పించారు.



ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న ఆకుల వీర్రాజు



వెంకటగిరిలో కేక్ కట్ చేస్తున్న దాసరి శివ, బొప్పన సుబ్బారావు



శాటిలైట్ సిటీలో కేక్ కట్ చేస్తున్న నేతలు



బుర్రిలంక రక్తదాన శిబిరంలో వేణుగోపాలకృష్ణ, డా.గూడూరి, ఆకుల వీర్రాజు, చందన నాగేశ్వర్ తదితరులు



జేగురుపాడులో జక్కంపూడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సతీష్‌చంద్ర స్టాలిన్



కడియపు సావరంలో నివాళులర్పిస్తున్న అభిమానులు



దోసాలమ్మ కాలనీలో పల్ల సుబ్రహ్మణ్యం, పల్ల సత్తిబాబు తదితరుల శ్రద్ధాంజలి



దోసాలమ్మ కాలనీలో స్టాలిన్, గిరిజాల బాబు నివాళులు